క్లుప్తంగా

'ఓపెన్' ప్రవేశాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

పాల్వంచ: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను స్థానిక స్టార్ చిల్డ్రన్స్ హైస్కూల్‌లో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎలాంటి విద్యార్హత లేకున్నా ఓపెన్ విద్యావిధానంలో చదివేందుకు అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి.భాస్కర్‌రావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డితో పాటు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, చింతా నాగరాజు, గంగుల వెంకటేశ్వరరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, పాబోలు నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులకు తమ సమస్యలను నేరుగా తెలిపేందుకు శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు సలహాలు, ఫిర్యాదుల నిమిత్తం 9959225959 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని కేయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి సెప్టెంబర్ 2 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్‌మోహన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు అందజేసిన వారికి చివరి కౌన్సెలింగ్ ఉంటుందని మిగిలిన ఖాళీలకు సంబంధించిన మార్గదర్శకాలను వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందన్నారు.

అభిప్రాయ సేకరణలో భాగస్వాములు కావాలి

కొత్తగూడెంఅర్బన్: వక్ఫ్ సవరణ చట్టం–2024 జాయింట్ పార్లమెంట్ కమిటీ నిర్వహిస్తున్న అభిప్రాయ సేకరణలో భాగస్వాములు కావాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్(సవరణ) బిల్లు 2024 వివరాలను లోక్‌సభ వెబ్‌సైట్‌లో ఇంగ్లీష్, హిందీ భాషల్లో పొందుపరచబడిందని, దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన అభిప్రాయాలను ఇంగ్లీష్, హిందీ భాషలలో రాత పూర్వకంగా రెండు సెట్‌లను జాయింట్ సెక్రటరీ, వెబ్‌సైట్‌కు సెప్టెంబర్ 12 లోపు పంపాలని, ముస్లింలు, సంఘాలు, మసీదు కమిటీలు తప్పకుండా అభిప్రాయాలను తప్పకుండా తెలియజేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

జూలూరుపాడు: పాపకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ధర్మరాజుల వెంకటనారాయణ అరటి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోత్ నవీన్, పాపకొల్లు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్కే.మీరా సాహెబ్, పీఎస్ హెచ్‌ఎం సంపూర్ణ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు

ఇల్లెందు: దాడి ఘటనలో ఇరువురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబల్ చందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాఘుబోయినగూడెం పంచాయతీ జింకలతండాకు చెందిన గుగులోతు రవిని అదే తండాకు చెందిన బానోతు నందూ, మాలోతు వీరూలు భూమి విషయంలో గొడవ పడి దాడిచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు, రేపు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో శని, ఆదివారాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపనలు చేయనున్నట్లు కమిషనర్ ధాకూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి

జూలూరుపాడు: మండలకేంద్రంలో బస్ షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలని భారతీయ గోర్ బంజార పోరాట సమితి, బీఎస్పీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రంలో సమితి ఉమ్మడి జిల్లా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గా ప్రసాద్, బీఎస్పీ మండలాధ్యక్షుడు తంబర్ల నరసింహారావులు మాట్లాడగా బీజీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూడ్ నాగరాజు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని
- 28 అంశాలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ సీతాలక్ష్మీ, పక్కన ఎమ్మెల్యే సాంబశివరావు, కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీలోని ప్రజల అవసరాలు, సౌకర్యాలు కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ అధ్యక్షతన ఏజెండాలలోని 28 అంశాలపై కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను ప్రతీ వార్డులో చేయించాలని, దీంతో పాటుగా దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పట్టణంలో వర్షాకాలం నేపథ్యంలో విరివిగా మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ఆమోదం తెలిపిన అంశాలు..

తొలుత ఏజెండాలలోని 28 అంశాలైన పారిశుద్ధ్య పనులకు కొబ్బరి చీపుర్లు కొనుగోలుకు రూ.1 లక్ష, దోమల నివారణకు వినియోగించే బయో లార్వా కొనుగోలుకు రూ.2 లక్షలు, నీటి సరఫరా పవర్ బోర్లు మెయింటెనెన్స్, లీకేజీలు, మోటర్ల రిపేర్‌కు అలమ్, క్లోరిన్ గ్యాస్, స్ట్రీట్ లైట్లు, ఎలక్ట్రికల్ సిబ్బంది రక్షణ సామగ్రి కొనుగోలు, శ్రీగంధం మొక్కలు తెప్పించుటకు రూ.27.75 లక్షలు, ఓపెన్ జిమ్‌ల మరమ్మతులకు రూ. 11.34 లక్షలు, సెంట్రల్ లైటింగ్ పోల్స్ నిర్వహణకు రూ.25 లక్షలు, యూపీఎస్ కొనుగోలు, వాల్ పెయింటింగ్స్‌కు రూ. 19 లక్షలు, పార్కుల్లో మొక్కలను సంరక్షించుటకు వాచర్లను ఎంగేజ్ చేయుట, విద్యుత్ ప్రమాదంలో గాయమైన దుర్గాప్రసాద్ చికిత్సకు రూ.4.50 లక్షలు, మృతి చెందిన ఓదెమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, అంత్యక్రియలకు రూ.10 వేలు, వైద్య ఖర్చులకు రూ.20 వేలు, నష్టపరిహారం రూ.3 లక్షలు, ప్రతీ వార్డులో కిన్నెరసాని పైపులైన్ల మరమ్మతులకు వార్డుకు రూ.1 చొప్పున 36 వార్డులకు రూ.36 లక్షలను 14 ఫైనాన్స్ నిధుల నుంచి కేటాయించడానికి మిగిలిన అంశాలను కౌన్సిల్ సభ్యులతో చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ దామోదర్, కౌన్సిల్ సభ్యులు, కమిషనర్ శేషాంజన్‌స్వామి, మేనేజర్ ప్రసాద్, డీఈ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని సిద్ధం చేయాలి

- ఎమ్మెల్యే కనకయ్య



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

టేకులపల్లి: మండలానికి నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరవ్వగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సరిపడా స్థలాన్ని సిద్ధం చేయాలని విద్యుత్, సర్వేయర్ అధికారులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతువేదిక పక్కన ఉన్న స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కనకయ్య విద్యుత్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ పి.బుజ్జికన్నయ్య, కార్యదర్శి శ్వేత నాయకులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కీర్తి చంద్రిక రెడ్డి

ఇల్లెందు: సీనియర్ సిటిజన్స్ రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికరెడ్డి కోరారు. శుక్రవారం గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవన్‌లో జరిగిన న్యాయచైతన్య సదస్సులో ఆమె మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయన్నారు. తమ పిల్లల నుంచి నిరాధరణ ఎదురైనా పోషించలేని పరిస్థితులు ఉన్నా సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, ఒక కమిటీని నియమించి విచారణ చేపడుతారన్నారు. న్యాయ సేవా సంస్థను ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సేవ ద్వారా సత్వర పరిష్కారం లభించేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్, వీరేంద్రబాబు, రిటైర్డ్ ఎంఈఓ స్వామీదాసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా సాగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, భద్రతా చర్యలు దృష్ట్యా పోలీసుల సూచనలను నిబంధనలను పాటించాలని పోలీసులు సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ పలు సూచనలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు తప్పకుండా పోలీసుల అనుమతి తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అనుమతి కూడా పొందాలని, కమిటీ ఫోన్ నంబర్ల ఫ్లెక్సీ ప్రదర్శించాలని, రాత్రి 10గంటల తర్వాత మైక్‌లను కట్టివేయాలని, డీజేలు ఉపయోగించొద్దని, లక్కీ డ్రాలు ఏర్పాటు చేయొద్దన్నారు. మద్యంసేవించి అల్లర్లకు పాల్పడినా, డీజేలతో ఇతరులకు అంతరాయం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సైలు నాగుల్‌మీరా పటాన్, భూక్యా సూర్య, మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగా పోటీలు



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీశారద విద్యాలయంలో అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి, వివిధ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అమీర్, జ్యోతి, లావణ్య, కల్యాణి, పీఈటీలు శ్రీరాములు తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

సామూహిక కుంకుమార్చన

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల శ్రీ రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని ఆలయ పూజారి ఫణి రాజాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ చెరుకుమల్ల కృష్ణయ్య, సభ్యులు డిల్లీ వెంకటేశ్వర్లు, అల్లాడి నరసింహారావు, మిర్యాల రమేష్, పూజారి లక్ష్మణా చార్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫాగింగ్

టేకులపల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి వి.దీప్తి ఆధ్వర్యంలో ముమ్మరంగా దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఏఎస్సై సూరయ్య అన్నారు. సైబర్ నేరాలపై స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డులో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా ఉండి వారిని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుళ్లు కృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం..

కొత్తగూడెంఅర్బన్: బీసీలకు కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో గాంధీఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్లు, బీసీ అజాది ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌లను బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యేర్రా కామేష్ శుక్రవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఇద్దరితో మొదలైన దీక్ష రాష్ట్ర వ్యాప్తంగా అంటుకొని పాలకుల కుర్చీలు ఖాళీ కాకముందే కులగణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో నాయకులు మురళి, శివ, నరేష్, రవిశంకర్ ఉన్నారు.



సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

దసరా ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అక్టోబర్ 3నుంచి 12వ తేదీ వరకు జరిగే శ్రీదేవి శరన్నవ రాత్రి(దసరా) ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేస్తున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. ఆసక్తి ఉన్న కళాకారులు వచ్చేనెల 2వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా ఆలయ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని ఈఓ తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాసులు



పాసులతో దివ్యాంగులు

చుంచుపల్లి: ఆర్టీసీ కొత్తగూడెం బస్టాండ్‌లో శుక్రవారం చుంచుపల్లి మండలానికి చెందిన దివ్యాంగులకు ఆర్టీసీ అధికారులు బస్‌పాసులు జారీ చేశారు. దివ్యాంగులకు ఆర్టీసీ ద్వారా పలు సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సామ్యూల్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని సిద్ధ ఈవీ హబ్ ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరుగుతున్న పెట్రోల్ ధరల దృష్ట్యా, ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రవేశ పెట్టడం ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, షోరూం యాజమాని తేజ కృష్ణ, కంపెనీ చైర్మన్ కె.వెంకట్ తేజ్, హీరో షోరూం అధినేత మచ్చ వెంకటేశ్వర్లు, పుల్లూరి కుమార్, అబీద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావు

పాల్వంచ: వ్యవసాయ కార్మికులకు కూలీ భరోసా పథకం అమలుచేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 5న చేపడుతున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో శుక్రవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులకు 200 రోజులు పనిదినాలు, రోజుకు వేతనం రూ.700 వేతనం, వ్యవసాయ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయింపు, పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే తదితర డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా బిక్కులాల్, నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గురుమూర్తి, తిరుపతిరావు, కృష్ణమూర్తి, చందు, ఆదినారాయణ, అడమయ్య, అమృతరావు, సత్యం, వెంకటేశ్వర్లు, లచ్చిరాం, బాలు, భిక్షం, లాల్‌పాషా పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా చదవాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి కష్టపడి ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు.మండల పరిధిలో శుక్రవారం పాండురంగాపురం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం సత్యనారాయణపురం, కోడిపుంజులవాగు, పాండురంగాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీకేంద్రాల్లో మధ్యాహ్న భోజనాల వంటలను తనిఖీచేశారు. ఇరిగేషన్ ఏఈ ఊర్మిళ, ఏపీఓ పారండ్లరంగా, సైదులు, కార్యదర్శులు పాషా, బాబా, ఖాళీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న గేర్షోమ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం దీక్షితులును గాంధీపథం కన్వీనర్ చింతలచెర్వు గేర్షోమ్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా గేర్షోమ్ మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిషార్కానికి జీఎం కృషి చేశారని కొనియాడారు.

ఉపాధ్యాయులకు..

పాల్వంచ: ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను శుక్రవారం పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, మండల నోడల్ ఆఫీసర్ ప్రకాష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగమ్మలు సన్మానించారు. అంకిత భావంతో పనిచేసే వారికి మంచి పేరు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు సన్మానం..

జూలూరుపాడు: గుండెపుడి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సురారం, అనంతారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసి విరమణ పొందిన ఆయాలను ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ సెలోమి ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, టీచర్లు సీతామహాలక్ష్మీ, సుజాత, సీహెచ్ సీతామహాలక్ష్మీ, పుల్లమ్మ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు విజయవంతం

జూలూరుపాడు: పాపకొల్లు(జూలూరుపాడు) ప్రభుత్వ యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వెంగన్నపాలెం బొడ్రాయి సెంటర్‌లో ఉచిత వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లో ప్రభుత్వ యునాని ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఎంకె.రాజేందర్‌రావు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం.మహేష్ గౌడ్, ఆయుర్వేద వైద్యురాలు శ్రీదేవీ, ఫార్మసిస్ట్ ఎస్.కృష్ణవేణి, వైద్యసిబ్బంది బి.విజయకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అదేవిధంగా మండలంలోని పెద్దహరిజనవాడ గ్రామంలో జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ రామక్రిష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం తార, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పుల్లాయిగూడెంలో ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ తేజశ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువురి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్స్‌కు పంపించారుర. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.సడలాదేవి, భీంసింగ్, హెల్త్ అసిస్టెంట్ శంకర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



సుజాతనగర్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



జూలూరుపాడు: పాపకొల్లులో..

సుజాతనగర్/ జూలూరుపాడు: ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాల ట కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా, జిల్లా నాయకులు ఏదులాపురం గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్ తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందజేయగా , జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు రైతువేదిక ఎదుట ధర్నా నిర్వహించి ఏఓ దీపక్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా, గోపాల్‌రావు రాయల సిద్ధు, నరేష్, నాగేశ్వరరావు, జగదీష్, చంద్రబాబు, ధర్మా, రాము, రమేష్, నరసింహారావు, నరేందర్, శివ, శ్రీను ఉన్నారు.

పాల్వంచరూరల్: అఖిల భారత ప్రగతిశీలరైతు సంఘం నాయకులు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు నిమ్మల రాంబాబు, వేల్పుల రమేష్, పద్మ, భాస్కర్, రవి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, స్వప్న, జ్యోతి, దినకర్‌లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఏడీఏ లాల్‌చంద్‌కు వినతిపత్రం అందజేశారు. మాస్‌లైన్ నాయకులు నాయిని రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: ఏడీఏకు వినతి

రుణమాఫీపై అపోహలు వద్దు..



పాల్వంచరూరల్: రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న ఏఓ, ఏడీఏలు



జూలూరుపాడు: వివరాలు సేకరిస్తున్న అధికారులు



సుజాతనగర్‌లో..

పాల్వంచరూరల్: ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని, వ్యవసాయశాఖ ఏర్పాటు చేస్తున్న సభ, సర్వేలో రైతులు సమస్యలు నివృత్తి చేసుకోవాలని ఏడీఏ నర్సింహారావు అన్నారు. మండల పరిధి కోడిపుంజులవాగులో శుక్రవారం వ్యవసాయశాఖ ఏర్పాటుచేసిన రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను పరిశీలించి మాట్లాడుతూ... పాల్వంచ వ్యాప్తంగా 711మంది రైతులను గుర్తించడం జరిగిందని, ఇప్పటివరకు 82 మంది రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అప్‌లోడుచేయడం జరిగిందన్నారు. కొత్తగూడెం ఏడీఏ పరిధిలోని పాల్వంచ, కొత్తగూడెం, చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో 2,500మంది రైతులకు రుణమాఫీ లో సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, ఈ సమస్యను అధిగమించే దిశగా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలో నిమగ్నమైనట్లు తెలిపారు.

నేడు పాండురంగాపురంలో..

మండల పరిధిలోని పాండురంగాపురంలో శనివారం రైతు రుణమాఫీ అంశంలో నేలకొన్న ఫిర్యాదులపై అప్‌లోడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు మండల వ్యవసాయశాఖ అధికారి శంభోశంకర్ తెలిపారు. వచ్చె నెల 2, 3, 4 తేదీల్లో వ్యవసాయ కార్యాలయంలో రైతుల అభ్యంతరాలను స్వీకరించనున్నట్లుతెలిపారు.

జూలూరుపాడు: రుణమాఫీకి సంబంధించిన రైతు కుటుంబ నిర్ధారణ సర్వే మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. మండలంలోని పాపకొల్లు రైతువేదికలో సర్వే శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఓ దీపక్ ఆనంద్ దరఖాస్తులను స్వీకరించారు. మండల వ్యాప్తంగా రేషన్ కార్డులు లేక 1,097 రైతు కుటుంబాలకు రుణమాఫీ కాలేదన్నారు. ఏఈఓలు బాను, గోపిక్రిష్ణ ఉన్నారు.

సుజాతనగర్: కుటుంబ నిర్ధారణ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ జి.నర్మద అన్నారు. మండలంలోని పాత అంజనాపురం రైతు వేదికలో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో రుణమాఫీ కాని రైతులు 330 మంది ఉన్నట్లు తెలిపారు. శనివారం సర్వారంలో, వచ్చే నెల 2న సుజాతనగర్‌లో కుటుంబ నిర్ధారణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏఈఓలు శరత్, ప్రసూష, నరసింహారావు పాల్గొన్నారు.